సాక్షి
ఆదిలాబాద్
సోమవారం । 3 ఏప్రిల్ । 2023



పొన్నారిలో 'బలగం' ప్రదర్శన

'బలగం' సినిమాను గ్రామస్తులందరికీ చూపించాలనే ఉద్దేశంతో తాంసి మండలం పొన్నారిలో స్వామిరెడ్డి ముందుకొచ్చాడు. ఎల్ ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ప్రదర్శించాడు. 8లో▸

నేడు దొడ్డి కొమురయ్య జయంతి

కైలాస్‌నగర్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతిని ఈ నెల 3న నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమానికి కుర్మ కులస్తులు, బీసీ సంఘాల ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

గరిష్టం/కనిష్టం
39.0/24.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరగనుంది. ఉక్కపోత ప్రభావం కనిపిస్తుంది.

ఇఫ్తార్ సోమ: 6:30
సహర్ మంగళ 4:45
రంజాన్ వేళలు





కిలోమీటర్ వెళ్తేనే తాగునీరు

- 'భగీరథ' సరఫరా అంతంతే!
- సాలెగూడలో నీటి ఇక్కట్లు

ఇంద్రవెల్లి మండలం తెజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సాలెగూడ వాసులకు తాగునీటి తిప్పలు తప్పట్లేదు. గ్రామంలోని బావులు, చేతిపంపుల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో పాటు ప్రతిరోజు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. దీంతో గ్రామానికి కిలోమీటర్ దూరంలో ఉన్న బోరు బావి నుంచి ఇలా ఎడ్లబండ్లు, బైక్‌ల ద్వారా నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారానికి ఒకటి.. రెండు రోజులు మాత్రమే భగీరథ నీరు సరఫరా అవుతున్నట్లు చెబుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. – ఇంద్రవెల్లి

న్యూస్‌రీల్

'పీఆర్సీ'ని వెంటనే నియమించాలి



మాట్లాడుతున్న సదానందగౌడ్

ఆదిలాబాద్‌టౌన్: పీఆర్సీ కమిటీని వెంటనే నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందగౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆ సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన జిల్లా కా ర్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీ, పదో న్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. రద్దు చేసిన పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 315 జీవో ద్వారా బదిలీ అయిన స్పౌజ్ ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు. ఉపాధ్యాయులు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో ఉన్న తీకరించిన స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మంజూరు చేయాలని పేర్కొన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో బడులు ప్రారంభమైన మొదటి రోజు పాఠ్య పుస్తకాలు అందజేయాలన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, శ్రీనివాస్, సంఘం నాయకులు రవీంద్ర, నరేందర్, రాజు పాల్గొన్నారు.

టీపీసీసీ సన్నాహక సమావేశంలో సాజిద్‌ఖాన్



పార్టీ రాష్ట్ర నాయకులతో సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: గాంధీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు టీపీసీసీ సన్నాహక సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వ రద్దును నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని, అలాగే యువత పోస్టు కార్డుల ద్వారా నిరసన తెలియజేయాలని సమావేశంలో పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావుఠాక్రే దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు. టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, ఇన్‌చార్జి కార్యదర్శి బోసు రాజు, మాజీ మంత్రి చిన్నారెడ్డిలను కలిసి జిల్లాలో పార్టీ పరిస్థితులను వివరించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలి



మాట్లాడుతున్న నారాయణ

ఆదిలాబాద్‌టౌన్: ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని కాకతీయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఈసం నారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక క్యాంప్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి సత్యనారాయణ, దయాకర్, అష్రఫ్ అలీ, సంతోశ్ కుమార్, కార్తీక్ పాల్గొన్నారు.

నో టెన్షన్.. ఆల్ ది బెస్ట్

- నేటి నుంచి 'పది' పరీక్షలు
- జిల్లాలో 54 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 10,699 మంది విద్యార్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ఆర్టీసీలో విద్యార్థులకు ఉచిత ప్రయాణం



జిల్లా కేంద్రంలోని ఓ పరీక్ష కేంద్రంలో శనివారం ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 54 కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెగ్యులర్ 10,606 మంది, ప్రైవేట్ 91 మంది కలిపి మొత్తం 10,697 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. సైన్స్ మినహా మిగతా పరీక్షలన్నీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కొనసాగనున్నాయి. ఈనెల 11న నిర్వహించే ఫిజిక్స్, బయోసైన్స్ పరీక్ష మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు కొనసాగనుంది.

నిఘా నీడలో..

ఈ పరీక్షలను నిఘా నడుమ నిర్వహించనున్నారు. ఇప్పటికే ప్రతీ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలు తెరిచే ముందు, జవాబు పత్రాల సీల్ ముందు వేయనున్నారు. పరీక్ష కేంద్రంలోకి సీఎస్, డీవోలు, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్‌లు, విద్యార్థులు సెల్‌ఫోన్ తీసుకురావడానికి అనుమతి లేదు. పరీక్ష జరిగే సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులను వెంట తీసుకురావద్దని అధికారులు సూచిస్తున్నారు. ఐడి కార్డు ఉన్నవారు మాత్రమే పరీక్ష కేంద్రంలోనికి అనుమతిస్తారు.

పరీక్ష నిర్వహణకు..

పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం 54 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 54 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 13 మంది కస్టోడియన్లు, 545 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా మూడు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో మండల విద్యాధికారి, డిప్యూటీ తహసీల్దార్, ఏఎస్సై ఉంటారు.

ఇబ్బందులు లేకుండా..

విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఆయా పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, వైద్యం, విద్యుత్ సౌకర్యంతో పాటు డ్యూయల్ డెస్క్‌లు ఏర్పాటు చేశారు. కాగా పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. హాల్‌టికెట్ చూపించి బస్సులో ప్రయాణించవచ్చు.

హెల్ప్ డెస్క్..

విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం విద్యాశాఖ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే జిల్లా కేంద్రంలోని కంట్రోల్‌రూమ్ వద్ద గల 08732–226434 నంబర్‌పై సంప్రదించాలని పేర్కొంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్ ఇవ్వకపోతే వెబ్‌సైట్ bse. telangana. gov. in నుంచి డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా పరీక్షకు హాజరుకావచ్చని సూచిస్తున్నారు.

భయాందోళన వద్దు..



విద్యార్థులు పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలి. అన్ని సెంటర్లలో సౌకర్యాలు ఏర్పాటు చేశాం. ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలి. మాస్‌కాపీయింగ్‌పై ఆధారపడొద్దు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం ఆర్టీసీ ఆయా రూట్లలో ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హాల్‌టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే హెల్ప్ డెస్క్‌ను సంప్రదించాలి. – ప్రణీత, డీఈవో

ఎట్టకేలకు మోక్షం

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి అగ్రికల్చర్ బీఎస్సీ తరగతులు
- 110 పోస్టుల భర్తీకి ఆర్థిక అనుమతి
- మొదటి ఏడాది 60 సీట్లతో మరూ
- జిల్లా వాసుల్లో హర్షం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఎట్టకేలకు బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల తరగతులు త్వరలో ప్రారంభం కానున్నాయి. 2018 ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లాకు వచ్చిన సీఎం కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న విజ్ఞప్తి మేరకు జిల్లాకు వ్యవసాయ కళాశాల మంజూరు చేస్తామని ప్రకటించారు. ఇచ్చిన హామీకనుగుణంగా రెండోసారి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కళాశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దీని నిర్వహణకు అవసరమైన బోధన, బోధనేతర సిబ్బందిని మంజూరు చేయలేదు. దీంతో కళాశాల ఏర్పాటుకు అడుగు ముందుకు పడలేదు. తాజాగా రానున్న విద్యాసంవత్సరం నుంచి ఈ కళాశాల తరగతులు ప్రారంభించేలా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ అకడమిక్ మానిటరింగ్ సమావేశంలో నిర్ణయించారు. పోస్టుల భర్తీకి సైతం ఆర్థికశాఖ ఆమోదం తెలుపడంతో తరగతులకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లైంది.

వచ్చే విద్యాసంవత్సరం నుంచి..

వ్యవసాయ కళాశాలకు సంబంధించి వచ్చే విద్యా సంవత్సరం 2023–24లో తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఆర్థికశాఖ ఇటీవల బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 110 పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు చేపడుతుంది. ఈ కోర్సు వ్యవధి నాలుగేళ్లు కాగా తొలి ఏడాది 60సీట్లను భర్తీ చేయనుంది. ఎంసెట్‌లో వచ్చే ర్యాంకుల ఆధారంగా విద్యార్థులకు సీట్లు కేటాయించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 6 వ్యవసాయ కళాశాలలుండగా, ప్రస్తుతం ఆదిలాబాద్‌లో ఏడోది ఏర్పాటు కానుంది. ఇదిలా ఉండగా గతంలో పనిచేసిన కలెక్టర్ వ్యవసాయ కళాశాల భవన నిర్మాణం కోసం మావల మండలంలోని బట్టిసావర్‌గాం ప్రాంతంలో 29.29 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కోవిడ్ సమయంలో ఈ కళాశాల ఏర్పాటు ముందుకు సాగకపోవడంతో ఆ స్థలాన్ని జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయానికి కేటాయించారు. అనంతరం జైనథ్ మండలంలోని మాంగూర్ల, కాన్పమేడిగూడ ప్రాంతంలో 90 ఎకరాల స్థలాన్ని కేటాయించేందుకు ప్రతిపాదించారు. స్థలం ఎంపిక, భవనం నిర్మాణం పూర్తయ్యేంతవరకు ప్రభుత్వ భవనాల్లో లేక, అద్దె భవనంలో తాత్కాలికంగా తరగతులు ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

జిల్లా వాసుల్లో ఆనందం

సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నేరవేర్చడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సుకు అధిక ప్రాధాన్యత ఉండటంతో చాలా మంది దీన్ని అభ్యసించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పేద విద్యార్థులు ప్రైవేట్ కళాశాలల్లో లక్షలాది రూపాయిలు వెచ్చించి ఈ కోర్సును చదువలేని పరిస్థితి ఉంది. ఈ క్రమంలో స్థానికంగా కళాశాల ఏర్పాటైతే జిల్లావాసులకు ప్రయోజనంతో పాటు రైతుల స్థితిగతులు, క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లాలోని ఆయా గ్రామాలను సందర్శించి సాగుపరంగా అవసరమైన సలహాలు, సూచనలు అందించనున్నారు. కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు వ్యవసాయాధికారులుగా, శాస్త్రవేత్తలుగా, ప్రైవేట్ సెక్టార్‌లో సైతం ఉద్యోగావకాశాలు పొందేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయి.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు



జిల్లాలో అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటు చేస్తున్నందుకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు. కరోనా కారణంగా కళాశాల ఏర్పాటు కొంత ఆలస్యం జరిగింది. జిల్లా యువతకు ఉజ్వల భవిష్యత్ అందించాలన్న కాంక్షతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – ఎమ్మెల్యే జోగు రామన్న

పాపన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్‌రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహనీయుల చరిత్ర భావితరాలకు అందజేయలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం వారి జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నదన్నారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజలింగం, స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్ శ్రీనివాస్, సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీనివాస్, నర్సాగౌడ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాపన్న గౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

పాపన్న గౌడ్ ఆశయాలను సాధిద్దాం

అదిలాబాద్‌రూరల్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను సాధిద్దామని సర్దార్ గౌడ యువజన సంఘం అధ్యక్షుడు గజానన్ గౌడ్ అన్నారు. పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దళిత శక్తి ప్రోగ్రాం(డీఎస్‌పీ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గణేశ్, గౌడ యువజన సంఘం నాయకులు సంతోష్, అనిల్, రవీందర్, సాయి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై ఆశలు

- మలి విడతకు సర్కారు సన్నద్ధం
- జీవాల రవాణాకు ఈ టెండర్లు
- అక్రమాలకు చెక్‌పెట్టేలా జియోట్యాగింగ్
- లబ్ధిదారుల నిరీక్షణకు తెర

జిల్లాలో గొర్రెల పంపిణీకి సంబంధించిన వివరాలు:
గొర్రెల పెంపకం సహకార సొసైటీలు 133
సొసైటీల్లోని మొత్తం సభ్యులు 8,660
మొదటి విడతలో యూనిట్లు పొందిన లబ్ధిదారులు 5,022
వెచ్చించిన నిధులు: రూ.62.77కోట్లు
ఇంకా పంపిణీ చేయాల్సిన యూనిట్లు: 3,597
రెండో విడత కోసం డీడీలు చెల్లించినవారు: 2,103



గొర్రెలు

కైలాస్‌నగర్: గొర్రెల పంపిణీ పథకం కింద యూనిట్ల కోసం డీడీలు చెల్లించి ఏళ్లుగా నిరీక్షిస్తున్న గొల్ల కుర్మల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. అర్హులైన వారందరికీ లబ్ధి చేకూర్చే దిశగా ప్రభుత్వం కసరత్తు షురు చేయడమే ఇందుకు కారణం. ఆయా జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గొర్రెల కొనుగోలు కోసం సమీప మార్కెట్లను మ్యాపింగ్ చేయాలని, టెండర్ల ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించడంతో మూడేళ్లుగా ఎదురుచూస్తున్న గొర్రెల పెంపకం సహకార సొసైటీ సభ్యుల్లో ఆశలు మొదలయ్యాయి. ఈ విడతలో ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా పకడ్బందీ విధి విధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. ప్రతీ గొర్రెకు బీమా సౌకర్యంతో పాటు జీవాలను రవాణా చేసే వాహనాలకు జియో ట్యాగింగ్ అమలు చేయనున్నారు. ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారులకు అవగాహన సదస్సులు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే కొత్తగా 18 ఏళ్లు నిండిన అర్హులైన వారికి గొర్రెలను అందించడంపై స్పష్టతనివ్వకపోవడంతో వారిలో నిరాశ వ్యక్తమవుతుంది.

యూనిట్ ధర రూ.1.75లక్షలకు పెంపు

ఒక్కో లబ్ధిదారునికి 20 గొర్రెలు, ఒక పొట్టేలును అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తూ మొదటి విడతలో రూ.1.25లక్షలుగా ఖరారు చేసింది. ఇందులో లబ్ధిదారుడు 25శాతం వాటాగా రూ.31,250 చెల్లించారు. ప్రభుత్వం 75శాతం వాటాగా రూ.93,750 జమచేసి గొర్రెలను అందజేసింది. ఇటీవల ధరలు పెరిగిన నేపథ్యంలో తాజాగా యూనిట్ ధరను రూ.1.75లక్షలకు పెంచారు. ఇందులో లబ్ధిదారుడు తన వాటాగా రూ.43,750 చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం 75శాతం వాటాగా రూ. 1,31,250తో లబ్ధిదారునికి గొర్రెలను పంపిణీ చేయనుంది. తొలి విడతలో అమలు చేసిన డీడీల విధానానికి ఈ సారి స్వస్తి పలికారు. డీడీలు అందించి నెలలు గడిచినా గొర్రెలను అందజేయకపోవడంతో అవి ల్యాప్స్ కావడం, అధికారులకు అందించిన డీడీలు దొరక్కపోవడం వంటి ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం వాటిని ఈ సారి రద్దు చేసింది. బదులుగా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి యాక్సిక్ బ్యాంక్ నుంచి ఆన్‌లైన్ అకౌంట్ నంబర్ కేటాయించింది. లబ్ధిదారుడు ఆ అకౌంట్‌కు తన వాట నగదు జమచేసినట్లైతే అది కలెక్టర్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ అవుతుంది.

3,597 మంది లబ్ధిదారుల ఎంపిక

గొల్ల, కుర్మల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం 2017లో గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టింది. గ్రామీణ ప్రాథమిక గొర్రెల పెంపకం సహకార సొసైటీల్లో సభ్యులుగా ఉన్న 18ఏళ్లు పైబడిన వారికి వీటిని అందించాలని నిర్ణయించింది. లబ్ధిదారుల ఎంపిక కోసం తహసీల్దార్, ఎంపీడీవో, మండల పశువైద్యాధికారితో కూడిన కమిటీని నియమించింది. వీరి ఆధ్వర్యంలో గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఏ, బీ గ్రూపులుగా లాటరీ ద్వారా ఎంపిక చేసింది. ఏ గ్రూపులో 4,323 మందిని ఎంపిక చేయగా అందులో 4,282 మందికి గొర్రెలను పంపిణీ చేశారు. 4,337 మందితో బి జాబితా తయారు చేయగా అందులో 740 మందికి మాత్రమే ఇప్పటి వరకు యూనిట్లను అందజేశారు. ఈ రెండు గ్రూపుల్లో నుంచి ఇంకా 3,597మందికి గొర్రెలను అందించాల్సి ఉంది. అయితే ఇందులో 2,103 మంది మాత్రమే డబ్బులు చెల్లించారు.

అక్రమాలకు చెక్ ...

తొలి విడత గొర్రెల పంపిణీలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయనే విమర్శలు వ్యక్తమయ్యాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ సారి పకడ్బందీ విధానాలను ఖరారు చేసింది. గొర్రెల కొనుగోలుకు జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో ఈ కమిటీని నియమించనున్నారు. జీవాలను కొనుగోలు చేసే మార్కెట్లను మ్యాపింగ్ చేసి, వాటిని తరలించే వాహనాలకు జియోట్యాగింగ్ చేపట్టనున్నారు. దీంతో గొర్రెలు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాయనేదీ స్పష్టంగా తెలియనుంది. అలాగే గొర్రెల కొనుగోలు జిల్లా స్థాయి సీనియర్ అధికారి పర్యవేక్షణలో చేపట్టాలని, వాటి రవాణాకు ఈ టెండర్లను నిర్వహించాలని ఆదేశించింది.

త్వరలోనే గొర్రెల యూనిట్ల పంపిణీ

అర్హులైన వారికి గొర్రెలను అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం గొర్రెల కొనుగోలు కోసం ఈ టెండర్ల ప్రక్రియ మొదలైంది. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటు రాష్ట్రంలోని పలు మార్కెట్లను గొర్రెల కొనుగోలు కోసం మ్యాపింగ్ చేశారు. జిల్లాకు ఎక్కడి నుంచి గొర్రెలను కొనుగోలు చేయాలనేదీ ప్రభుత్వమే నిర్ణయిస్తోంది. వాటి రవాణాకు జీపీఎస్ అమలు చేయనున్న నేపథ్యంలో ఈ సారి ఎలాంటి అక్రమాకులకు అవకాశం ఉండదు. త్వరలోనే అర్హులైన వారికి యూనిట్లు అందనున్నాయి. – బి.కిషన్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి

స్థలాల క్రమబద్ధీకరణకు మరో అవకాశం

- ఈ నెల 30వరకు దరఖాస్తుల స్వీకరణ
- కటాఫ్ తేదీ గడువు పెంపు

కైలాస్‌నగర్: ప్రభుత్వ ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశాన్ని కల్పించింది. అసైన్డ్, సీలింగ్, అభ్యంతరం లేని ఇతర ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్న వారికి నిబంధనల మేరకు పట్టాలు జారీ చేయనుంది. జీవో 58, 59 కింద అర్హులైన వారు దరఖాస్తు చేసుకునేందు కోసం ఈ నెల 30 వరకు అవకాశం కల్పించింది. ఇప్పటికే రెండు సార్లు దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం తాజాగా కటాఫ్ తేదీ గడువు 2020 జూన్ 2వ తేదీ వరకు పొడిగిస్తూ మరో అవకాశం కల్పించింది.

ముచ్చటగా మూడో సారి..

125 చదరపు గజాల లోపు స్థలాలు కలిగిన పేదలకైతే ఉచితంగా, అంతకు మించి ఎక్కువ విస్తీర్ణం కలిగిన భూములకు మార్కెట్ ధరకనుగుణంగా క్ర మబద్ధీకరించేలా ప్రభుత్వం జీవోలను జారీచేసింది. ఇప్పటి వరకు రెండు సార్లు దరఖాస్తులను స్వీకరించగా.. ముచ్చటగా మూడోసారి కూడా అవకాశం కల్పించింది. ఈ నెల 30లోపు మీ సేవకేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. అలాగే ఆక్రమిత భూముల కటాఫ్ తేదీని ఆరేళ్లకు పెంచింది. గతంలో 2014 జూన్2లోపు వారికే అవకాశమివ్వగా ప్రస్తుతం దాన్ని 2020 జూన్ 2వ తేదీ వర కు పొడగించింది. దీంతో ఈ సారీ మరింత మందికి ప్రయోజనం చేకూరే అవకాశం కలిగింది. గతంలో సరైన ఆధారాలు లేక దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు, దరఖాస్తులు తిరస్కరణకు గురైన వారు సైతం ప్రస్తుతం దరఖాస్తు చేసుకునేలా అవకాశం కల్పించారు.

జిల్లాలో 1,524 దరఖాస్తులు

క్రమబద్ధీకరణ కోసం ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 1524 దరఖాస్తులు అందాయి. ఇందులో జీవో 58 కింద 801 దరఖాస్తులు రాగా అందులో 203 అర్హులుగా తేల్చుతూ వారికి జిల్లా యంత్రాంగం మహిళా దినోత్సవం రోజున పట్టాలు సైతం జారీ చేశారు. అలాగే 59 జీవో కింద 723 దరఖాస్తులు అందాయి. ఇందులో అర్హులైన వారిని గుర్తించేందుకు జిల్లా స్థాయి అధికారుల ద్వారా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. వాటి వివరాలను ప్రభుత్వం నిర్దేశించిన ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. ఈ పట్టాల పంపిణీపై ప్రభుత్వం స్పష్టతనివ్వకపోవడంతో పెండింగ్‌లో ఉంచారు. తాజాగా ఈ దరఖాస్తులకు సంబంధించిన రుసుంను మార్కెట్ విలువ ప్రకారం వసూలు చేసి పట్టాలను జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో వీటికి మోక్షం కలిగే అవకాశముంది. అలాగే మరోసారి స్థలాల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించడంతో ఈ సారి దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.

క్లుప్తంగా

నేటి నుంచి పది పరీక్షలు

ఉట్నూర్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 ఆశ్రమ పాఠశాలలున్నాయి. టెన్త్ విద్యార్థులు 3,901 మంది ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 1776, ఆసిఫాబాద్‌లో 1250, మంచిర్యాలలో 460, నిర్మల్‌లో 415 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్ మాట్లాడారు. వంద శాతం ఫలితాలు సాధించేలా ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించామన్నారు. ప్రతి గిరిజన విద్యార్థికి పరీక్ష ప్యాడ్, చేతి గడియారం, జామెట్రీ బాక్స్, పెన్నులు, లాంగ్ స్కేల్ అందించినట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగ అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఖుడియార్ మొహల్ల కాలనీకి చెందిన ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను దొంగలించి బైక్‌పై పరారైన దొంగలను టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రైల్వే గేట్ సమీపంలో నంబర్‌ప్లేట్ లేని బైక్‌ను ఆపి వారిని విచారించారు. సెల్‌ఫోన్ దొంగలించిన విషయాన్ని వారు ఒప్పుకున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. నిందితుడు రోహిత్‌తోపాటు మరో బాలుడిని అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నట్లు వివరించారు.

బైక్ చోరీ

భైంసా: బాసర ఆలయ సమీపంలో ఓ బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు బైక్‌పై వచ్చి ఆలయం ఎదుట వాహనం నిలిపాడు. దర్శనం అనంతరం చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశాడు.

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కడెం: మండలంలోని పాండ్వపూర్ గ్రామ సమీపంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీ నిర్వహించారు. ముగ్గురికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తాగినట్లు తేలింది. వీరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై భీంరావు పేర్కొన్నారు.

'ఆలయాలపై చిన్నచూపు'



మాట్లాడుతున్న లక్ష్మీప్రసన్న

జైనథ్: తెలంగాణ ప్రభుత్వం హిందూ ఆలయాలపై చిన్నచూపుచూస్తోందని బీజేపీ ఏపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయాన్ని ఆదివారం సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హిందూ ఆలయాల అభివృద్ధి జరగాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలో తిరుగుతూ ఆలయాల పరిస్థితిపై నివేదికలు సిద్ధం చేసి కేంద్ర నాయకత్వానికి అందిస్తామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాందాస్, నాయకులు జ్యోతిరెడ్డి, ప్రతాప్‌యాదవ్, సంతోష్, అశోక్‌రెడ్డి, జ్యోతి ఉన్నారు.



నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు కుప్పలు

పసుపు కొనుగోళ్లలో మాయాజాలం



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు మామిడి ప్రవీణ్‌రెడ్డి. లోకేశ్వరం మండలం ధర్మోర గ్రామం. తనకు ఉన్న ఎకరంలో ఈ ఏడాది పసుపు సాగు చేశాడు. అధిక వర్షాలకు పంటకు దుంప తెగులు సోకింది. గతేడాది ఎకరాకు 22 క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది 16 క్వింటాల్ మాత్రమే వచ్చింది. పసుపు విక్రయించేందుకు నిజామాబాద్ మార్కెట్‌కు తరలించాడు. తూకం వేస్తే మండ నాలుగు, కొమ్ము పదకొండు క్వింటాల్ అయింది. మండ క్వింటాల్ రూ.5400, పసుపు కొమ్ము క్వింటాల్ రూ.5200 ధర పలికింది. పెట్టుబడి రూ.45 వేలు, 9 నెలలు కష్టపడితే రూ.33 వేలు మాత్రమే వచ్చిందని రైతు వాపోయాడు. జిల్లాలోని రైతులందరి పరిస్థితి ఇది.

లోకేశ్వరం: పసుపు పంటకు తెగుళ్లు సోకడంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. ధరలు పెరిగాయన్న ఆనందం జిల్లా రైతుల్లో ఆవిరైంది. నిజామాబాద్ మార్కెట్‌లో వ్యాపారులు కొనుగోళ్లలో మాయాజాలంతో నిర్మల్ జిల్లా రైతులు ఆగం అవుతున్నారు. పసుపు ఒక కుప్పకు అధిక ధర కోట్ చేస్తున్నారు. క్వింటాల్‌కు రూ.6200 చెల్లిస్తున్నారు. మిగతాది నాణ్యత లేదంటూ ధర తగ్గిస్తున్నారు. క్వింటాల్ రూ.4 వేలు ఇస్తుండడంతో జిల్లా రైతులు నష్టపోతున్నారు.

తెగులు..దిగులు

అప్పులు పెట్టుబడిగా పెట్టి 9 నెలలకు పైగా కష్టపడి పండించిన పసుపు పంట అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ ఏడాది గిట్టుబాటు లభించని పరిస్థితి. పెట్టిన పెట్టుబడి చేతికందే పరిస్థితి లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాదిలో అధిక వర్షాలు కురవడంతో అధిక తేమశాతంతో పసుపు పంటకు మర్రి ఆకు, దుంపకొళ్లు తెగుళ్లు సోకి దిగుబడి సగానికి పడిపోయింది. ఇప్పటికే పంట తవ్వుతున్న రైతులకు భూమిలోంచి వస్తున్న దిగుబడిని చూసి కన్నీటి పర్యంతమవుతున్నారు. నిరుడు సగం కూడా చేతికి రావడం లేదని, పెట్టుబడి చేతికి రాదని దిగాలు చెందుతున్నారు.

నిర్మల్ టు నిజామాబాద్

నిర్మల్ జిల్లాలో 16 వేల ఎకరాల్లో రైతులు పసుపు పంటలు సాగు చేశారు. ఈ పంట విక్రయించేందుకు నిజామాబాద్‌కు లేదా 600 కి.మీ దూరంలో ఉన్న మహారాష్ట్రలోని సాంగ్లీకి తీసుకెళ్లాలి. ఇది రైతులకు భారంగా మారింది. నిజామాబాద్ మార్కెట్‌లో పంటకు అత్యధికంగా ధర పలుకుతుందని ఆశిస్తే వారికి చేదు అనుభవం ఎదురైంది. పసుపు ఉత్పత్తుల్లో ఏదో ఓ కుప్పకు అధిక ధర పెట్టి మిగతా వాటికి తగ్గిస్తున్నారు. ఎక్కువ మంది అక్కడికి వెళ్లి ఇలా మోసపోతున్నారు. జిల్లా రైతులు నాలుగైదు లారీల్లో పసుపును నిజామాబాద్ తీసుకెళ్లగా క్వింటాల్ రూ.5 వేల నుంచి రూ.6200 లోపే ధర పలికాయి. దీనికి తోడు రైతులు పసుపు విక్రయంలో అడ్డగోలుగా ఖర్చులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. లారీ కిరాయి నుంచి హమాలీ, చాట, సడెం, క్యాష్ కటింగ్ అంటూ లేని పోనిఖర్చులు వసూళ్లు చేస్తూ మరింత దోచుకుంటున్నారు.

- నిజామాబాద్ మార్కెట్‌లో వ్యాపారుల మోసం
- ఒక కుప్పకు అధిక ధర
- మిగతాది నాణ్యత లేదని తగ్గింపు
- నష్టపోతున్న జిల్లా రైతులు

రైతుల ఆశలు..

మూడేళ్ల క్రితం క్వింటాల్ పసుపు రూ.16 వేల వరకు గిట్టుబాటు ధర ఉండేది. విత్తనం నాటి నుంచి పసుపు తవ్వి ఉడికించి ఆరబెట్టే వరకు అయిన ఖర్చు లెక్కిస్తే రైతుకు చుక్కలు కనిపించాయి. ఈసారి కనీసం మద్దతు ధర క్వింటాల్ రూ.10 వేల నుంచి రూ.15 వేలైనా దక్కుతాయని రైతులు ఆశిస్తున్నారు.

ఒక కుప్పకే అధిక ధర



వ్యాపారులు పసుపు ఒక కుప్పకు అత్యధిక ధర పెడుతున్నారు. మిగతా పసుపునకు నాణ్యత లేదని క్వింటాల్ రూ.2 వేలు తగ్గిస్తున్నారు. గతేడాదిలో పోల్చితే ఓ మోస్తరు. ధర ఉన్నా రైతులకు దక్కడం లేదు.

– మంద శ్రీధర్, పసుపు రైతు

భయమేస్తోంది



మొదటి నుంచి ఖర్చు చేసింది లెక్క పెడితే చాలా ఉంది. ఇప్పుడు పసుపు తవ్వించేందుకే పెడుతున్నా చాలా భయమేస్తోంది. ఇదే ధర ఉంటే బాగా నష్టపోతాం. వచ్చే సంవత్సరం ఈ పంట వేయకపోవడమే మంచిది.

– రాజు, పసుపు రైతు

మహిళా సాధికారతే బీజేపీ లక్ష్యం

- బీజేపీ ఏపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లక్ష్మీసంతోషి



లక్ష్మీసంతోషిని సన్మానిస్తున్న నాయకులు

ఖానాపూర్: మహిళా సాధికారతే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ పార్టీ ఏపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పొన్నాల లక్ష్మీసంతోషి అన్నారు. మండలంలోని తర్లపాడ్ గ్రామంలో గల ఓంకారేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆమెను నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలతోపాటు పలువురు గ్రామస్తుల ఇళ్లకు వెళ్లి కేంద్ర పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. ప్రధాని మోదీ తలపెట్టిన మహిళా మోర్చా ప్రవాసీయోజనలో భాగంగా మాతా, శిశుసంరక్షణ, మహిళలకు స్వేచ్ఛ తదితర విషయాలపై వారితో మాట్లాడారు. పట్టణంలోని మహాత్మాజ్యోతి బాపూలే బాలికల పాఠశాలను సందర్శించి సౌకర్యాలు, వసతులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. పది పరీక్షల్లో ధైర్యంగా రాసి పాఠశాల, తల్లిదండ్రులు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఆమె వెంట పెంబి జెడ్పీటీసీ జానుబాయి, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్, నాయకులు నాయిని సంతోశ్, టేకు ప్రకాశ్, తోకల బుచ్చన్న, డి.మల్లయ్య, గిరి, పెద్ది రమేశ్, ఎనగందుల రవి, ఇనుముల స్వామి, మేకల వెంకటేశ్, సుధాకర్, రాము, రాజేశ్వర్, సాయి ఉన్నారు.

బీసీల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: బీసీల అభివృద్ధికి కేంద్రం పెద్దపీట వేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా ఇన్‌చార్జి మాదాసు స్వామియాదవ్ అన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మణ్ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా లక్ష గ్రామాల్లో కోటి కుటుంబాలను నేరుగా కలిసేందుకు 'పల్లె పల్లెకూ ఓబీసీ ఇంటింటికీ బీజేపీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గోడప్రతులు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాదాసు స్వామియాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 10 వేల గ్రామాలు 10 వేల కుటుంబాలను ఓబీసీ మోర్చా కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లాలన్నారు. మోదీ పాలనలో బీసీల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 6న బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం నుంచి 14 తేదీ వరకు బీఆర్ అంబేద్కర్ జయంతి వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అమరవేణి నర్సాగౌడ్, కార్యవర్గ సభ్యులు నారాయణ గౌడ్, లింబద్రి, నాగనాథ్, రావుల పోశెట్టి, జిల్లా అధ్యక్షుడు దడిగి భోజన్న, ప్రధాన కార్యదర్శులు రమేశ్, మల్లేశ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసమ్మె రాజు తదితరులు పాల్గొన్నారు.

పొన్నారిలో 'బలగం' ప్రదర్శన



ఒక్కచోట చేరి వీక్షిస్తున్న గ్రామస్తులు

తాంసి: తెలంగాణ యాస, భాషతో దర్శకుడు వేణు నిర్మించిన 'బలగం' సినిమాకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కుటుంబ సభ్యుల మమకారం, ఆత్మీయత గురించి పల్లెటూరి నేపథ్యంతో సాగే ఈ చిత్రం ప్రతి ఒక్కరి మనస్సుకు దగ్గరైంది. తాంసి మండలం పొన్నారిలో గ్రామస్తులందరూ 'బలగం' చిత్ర ప్రదర్శనను వీక్షించేలా చింతలపెల్లి స్వామిరెడ్డి తన సొంత డబ్బులతో ఎల్‌ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశాడు. ఆదివారం సాయంత్రం పాత పంచాయతీ భవనం వద్ద ఎల్‌ఈడీ స్క్రీన్‌లో బలగం సినిమాను ప్రదర్శించారు. చిన్నాపెద్దలు ఒక్కచోట చేరి వీక్షించారు.

మహిళ అదృశ్యం



స్రవంతి(ఫైల్)

దహెగాం: మండలంలోని పంబాపూర్ గ్రామానికి చెందిన బొర్కుట స్రవంతి (30) అదృశ్యమైనట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గత నెల 31న ఇంట్లో నుంచి వెళ్లిన స్రవంతి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. స్రవంతి భర్త మొహన్‌దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



దీపిక (ఫైల్)

లోకేశ్వరం: చెరువులో దూకి డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పుస్పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. పుస్పూర్‌కు చెందిన దీపిక (17) భైంసా పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని తాత పెద్ద ముత్తన్న వీఆర్‌ఏ గతనెల 20న గుండెపోటుతో మృతిచెందాడు. తాత చనిపోవడంతో దీపిక మానసికంగా కుంగిపోయి బాధపడుతుండేది. ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లింది. ఎంత సేపటికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబీకులు వెతికారు. గ్రామ శివారులోని బోప్పాజీ చెరువు వద్ద ఆమె చెప్పులు కనిపించాయి. చెరువులో దీపిక మృతదేహం లభించింది. తాత మృతితో జీవితంపై విరక్తి చెంది దీపిక చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు. తండ్రి చిన్న ముత్తన్న ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి..



అశోక్ మృతదేహం

సారంగపూర్: జీవితంపై విరక్తితో వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన సీరె అశోక్ (60) గత కొన్నేళ్ల క్రితం భార్య, కుమార్తెతో విడిపోయి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో తన ఆరోగ్యం దెబ్బతినడంతో తనను ఆదరించేవారు లేక మరింత అనారోగ్యానికి గురయ్యాడు. సక్రమంగా భోజనం చేసేవాడు కాదు. ఆరోగ్యం సహకరించకపోవడం, అన్ని పనులు చేసుకోలేక తీవ్ర మనస్తాపం చెందాడు. ఆదివారం తన ఇంటి ముందు పందిరిగుంజకు ఉరేసుకుని అశోక్ ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, మృతుడి చెల్లె ఎరాడ్ల లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు 16 ఏళ్ల కుమార్తె ఉన్నారు.

జై బోలో హనుమాన్ కీ



డోలషాను ఆసక్తిగా చూస్తున్న యువత

- ఘనంగా విజయయాత్ర
- హనుమాన్ నామస్మరణతో మార్మోగిన వీధులు

నిర్మల్‌టౌన్: రామలక్ష్మణ 'జానకీ' జై బోలో 'హనుమాన్'కి అంటూ జిల్లా కేంద్రం హనుమాన్ నామస్మరణంతో మార్మోగింది. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం వీర హనుమాన్ విజయ యాత్ర పట్టణ పురవీధుల గుండా ధ్యగావాడ, బాగులవాడ, బస్టాండ్ లైన్, బుధవార్‌పేట్, గాంధీచౌక్ మీదుగా కొనసాగింది. భక్తులు తమ ఇళ్లపై నుంచి హనుమాన్ విగ్రహంపై పూల వర్షం కురిపించారు. కాషాయ జెండాలతో జై శ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. ఇందులో ముంబైకి చెందిన డోలషా బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువత, స్వాములు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. సుమారు రెండువేల మంది హిందువులు యాత్రలో పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక దేవరకోట దేవస్థానం వద్ద రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ హనుమాన్ విగ్రహానికి పూజలు చేసి, జెండా ఊపి విజయయాత్రను ప్రారంభించారు. మంత్రి నృత్యం చేసి, బ్యాండ్ కొట్టి అందరిని అలరించారు. నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ దగ్గరుండి ర్యాలీని పర్యవేక్షించారు. ప్రార్థన స్థలాల వద్ద భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, దేవరకోట ఆలయ చైర్మన్ లింగంపల్లి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, బీజేపీ నాయకుడు అప్పల గణేశ్‌చక్రవర్తి, వక్తలు జిన్నా సత్యనారాయణ, డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, శ్రీనివాస్, రఘునందన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, బజరంగ్ దళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంచినీటి పంపిణీ

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో వీర హనుమాన్ విజయయాత్ర సందర్భంగా శ్రీధర్మశాస్త్ర యూత్ సభ్యులు భక్తులకు ఉచిత మంచినీటి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు నీటిని అందించారు. మణికంఠ, సాయికృష్ణ, చింతపండు రమేశ్, తూర్పు రమేశ్, రవీందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

'అడెల్లి'లో భక్తుల సందడి



మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

సారంగపూర్: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన శ్రీఅడెల్లి మహా పోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చి అమ్మవారికి మొక్కు చెల్లించుకున్నారు. ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా అమ్మవారి విగ్రహాన్ని బాలాలయం ఏర్పాటు చేసి ప్రతిష్ఠించారు. భక్తుల కోసం ఆలయ కమిటీ సీనియర్ అసిస్టెంట్ రమణారావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. చాలామంది పురాతన ఆలయం ఎదుట అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



పూజలు చేస్తున్న భక్తులు

గజ్జలమ్మ దేవికి పూజలు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. మహారాష్ట్రలోని నాందేడ్, బోకర్, ధర్మాబాద్, మలక్‌జామ్, శివుని, అప్పారావుపేట్ ప్రాంతాల నుంచి వచ్చి పూజలు చేశారు. గజ్జలమ్మ దేవి పల్లకిసేవలో భక్తులు పాల్గొన్నారు. గజ్జలమ్మ వెండి తొడుగు ముఖ ద్వారానికి భక్తులు 30 తులాల వెండిని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేశ్ ఉన్నారు.

అప్రమత్తతతో చోరీలకు అడ్డుకట్ట

- అనుమానితుల సమాచారం ఇవ్వాలి
- ప్రజలకు పోలీసుల సూచనలు

నేరడిగొండ: వేసవి అంటే కేవలం ఉక్కపోత..వడదెబ్బే కాదు.. దొంగలు కూడా ఉంటారని గ్రహించాలి. ఉక్కపోతకు తట్టుకోలేక రాత్రి సమయంలో జనం ఆరుబయట నిద్రపోతుంటే దొంగలు ఎంచక్కా తమ పని కానిచ్చేస్తారు. బీరువాలు తెరిచి సొత్తుతో పారిపోతుంటారు. వేసవిలో విహార యాత్ర, తీర్థయాత్రలకు.. ఊళ్లకు వెళ్లే కుటుంబాలే లక్ష్యంగా దొంగలు పెట్రేగిపోతున్నారు. పోలీసులు కూడా నిత్యం ప్రతి ఇంటిని గమనించలేరు. అందుకే ప్రజల్లో కూడా చైతన్యం రావాలంటున్నారు. అప్రమత్తంగా ఉంటే దొంగల ఆట కట్టించవచ్చని పోలీసులు చెబుతున్నారు.

రెక్కీ నిర్వహించి దోచేస్తారు..

దొంగతనాలకు వేసవి అనువుగా ఉంటుంది. దొంగలు ఎంచుకున్న ఇంటి పరిసరాలను రెండు, మూడు రోజులుగా పరిశీలిస్తారు. అంటే బిక్షగాళ్లుగా లేదా చెత్త కాగితాలు ఏరుకునే వారిలా వచ్చి ప్రణాళికా రచించి సులువుగా పని ముగించుకుంటారు. కొందరు బంగారం మెరుగుపడతామని కళ్ల ముందే నగదు దోచేస్తారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వేసవిలో అధిక శాతం చోరీలు జరిగే అవకాశం ఉంది. ఆయా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రాత్రివేళ వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తాం. అనుమానితులు ఎవరైన కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వీధుల్లోకి వచ్చే బీట్ కానిస్టేబుల్ నంబర్ దగ్గర పెట్టుకుని పోలీసులకు సహకరిస్తే చోరీలను నివారించవచ్చు.

– సాయన్న, ఎస్సై, నేరడిగొండ

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- చోరీలకు వచ్చే దొంగలు ఒకరోజు ముందే రెక్కీ నిర్వహిస్తారు. అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంటి కిటికీలను మూసివేయాలి. వాటికి ఉన్న బోర్డులు సక్రమంగా ఉన్నాయో లేదో ఎప్పటికప్పుడు చూసుకోవాలి.
- దుస్తుల్లో డబ్బులు పెట్టి కిటికీలకు, తలుపులకు తగిలించొద్దు.
- ఆరుబయట, మిద్దెలపై నిద్రించే వారు అప్రమత్తంగా ఉండాలి. ఇంటికి ఒకటికి, లేక రెండు తాళాలు వేసుకోవాలి.
- బంగారు ఆభరణాలు ధరించి ఆరుబయట నిద్రించొద్దు. ఇంట్లో పడుకున్నా కిటికీలు మూసివేయాలి.
- వీలైతే ఇంటి ఆవరణలో పెంపుడు కుక్కలను కట్టేయాలి.
- దూరప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్‌కు తెలపాలి.
- రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా వస్తే వారి వివరాలు తెలుసుకుని నమోదు చేసుకోవాలి.
- అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ఇంట్లో బంగారం, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి.